## జార్ఖండ్ ప్రజలపై పోలీసు కాల్పులలో మృతిచెందిన యువకుల సంస్మరణసభ

**జార్ఖండ్** రాష్ట్రం–హజారీబాగ్ ఛాత్రలతేహార్, కర్నాపూర్ బచావో సంఘర్ష్ సమితి, బడ్కాగావ్‌ల ఆధ్వర్యంలో 2018 అక్టోబర్ 1న దాదా కళా మైదాన్‌లో సభ నిర్వహించారు. 2016 అక్టోబర్ 1న పోలీసు కాల్పులలో మరణించిన నలుగురు యువకులను సంస్మరించుకుంటూ ఈ సభ జరిపారు.

చాలాకాలంగా కర్నాపూర్ ప్రాంత ప్రజానీకం, ఈ ప్రాంతంలో బడాకంపెనీలు సాగిస్తున్న భూముల దురాక్రమణను, ఖనిజ సంపదల లూటీని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా 2016 అక్టోబర్ 1న విద్యార్థులు, యువకులు, పెద్దసంఖ్యలో ప్రజానీకం వీధుల్లోకి వచ్చారు. నీరు–అడవి–భూమి ప్రజలకే చెందాలని, ఖనిజ సంపదపై అధికారం ప్రజలదేనని, బడా కార్పొరేటు కంపెనీల లూటీని వ్యతిరేకించాలని వారంతా నినదించారు. ఎన్‌టిపిసి యాజమాన్యంతో, స్థానిక యంత్రాంగంతో కుమ్మక్కు అయిన పోలీసులు శాంతియుతంగా ఆందోళన సాగిస్తున్న ప్రజలపై బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ కాల్పులలో మెహతాబ్ ఆలమ్, రంజన్‌కుమార్ దాస్, పవన్‌కుమార్ సావ్, అభిషేక్ రాయ్ అనే నలుగురు యువకులు అమరులయ్యారు. ఇంకా అనేక మందికి తీవ్రంగా గాయాలయ్యాయి.

కాల్పులలో యువకులు మరణించి రెండు సంవత్సరాలు గడిచింది. అయినప్పటికీ కంపెనీ యాజమాన్యం లేదా పోలీసు అధికారులపై ప్రభుత్వం ఎలాంటి చర్యా తీసుకోలేదు. బిజెపి ప్రభుత్వ ఆధ్వర్యంలో కర్నాపూర్ ప్రజలపై దాడులు, నిర్బంధం నిరాటంకంగా జరిగిపోతున్నాయి. అందువలన, కర్నాపూర్ బచావో సంఘర్ష్ సమితి తమ నిరసన ఆందోళనను తీవ్రంచేయాలని, ప్రజల హక్కులను హరించివేస్తున్న ప్రభుత్వ నిర్బంధ విధానాలను వ్యతిరేకించాలని నిర్ణయించింది.

ఈ ప్రయత్నంలో భాగంగానే 2016 అక్టోబర్ 1న పోలీసు కాల్పులలో మృతిచెందిన యువకులకు నివాళులర్పించే కార్యక్రమాన్ని చేపట్టింది. పెద్దసంఖ్యలో ప్రజానీకంతో పాటుగా నిరసనోద్యమ నాయకులనేకమంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2016 నాటి మృతులకు వక్తలు, ప్రజానీకం జోహార్పర్పించారు. నిరసనకారులపై కాల్పులు జరిపి హతమార్చిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణకోసం ప్రస్తుత నిరసనోద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. 2016 మృతవీరులకు అర్పించే సరైన నివాళి అదేనని పేర్కొన్నారు. ప్రజలు సమధికోత్సాహంతో, నిశ్చయాత్మకతతో ఈ ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

oooo